

శక్తిస్వరూపిణీ.. పాహిమాం

దేవీనవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను గురువారం దుర్గాదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అమలాపురంలో పసుపు కొమ్ములతో సుబ్బాలమ్మ అమ్మవారిని అలంకరించిన దృశ్యమిది. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ




వాడపల్లిలో పందిరిరాట ముహూర్తంలో అర్చకులు, నాయకులు

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర ఆలయంలో ఈ నెల 21 నుంచి 29 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం పందిరి రాట ముహూర్త కార్యక్రమం నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం, గోపూజ, ఇతర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. -న్యూస్‌టుడే, వాడపల్లి (ఆత్రేయపురం)

దసరాకు.. ధరాఘాతం

కొనలేనంత భారంగా నిత్యావసరాలు, కూరగాయలు



ఈనాడు, కాకినాడ: దుష్ట సంహారం కోసం ఆదిశక్తి తొమ్మిది రూపాలు ధరించిందని పురాణాలు చెబుతున్నాయి. అన్నప్రసాదాలంటే అమ్మవారికి ప్రీతి.. అందుకే దసరా పర్వదినం వచ్చిందంటే ఆ సందడే వేరు. నవ రాత్రుల్లో ప్రతిరోజూ తొమ్మిది రకాల ప్రసాదాలు పెడుతున్నారు. ఒక్కోరోజు ఒక్కో ప్రసాదంతో అమ్మకు నైవేద్యం అందిస్తారు. పెరుగుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలతో శక్తి స్వరూపిణికి సమర్పించే నవ నైవేద్యాలకూ ధరాఘాతం తప్పడంలేదు. గత రెండేళ్లలో అన్నీ పెరిగాయి.


ఏరోజు ఏ నైవేద్యం పెట్టారంటే..

నవరాత్రుల్లో మొదటిరోజు అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి బెల్లం పొంగలిని నైవేద్యంగా పెట్టారు. రెండోరోజు గాయత్రీ దేవికి ఉడకబెట్టిన పెసలు, పెసరపప్పు పొంగలి, పులిహోర.. మూడోరోజు అన్నపూర్ణకు దద్ధోజనం, పాయసన్నం, పొంగలి, కొబ్బరి అన్నం పెట్టారు. ప్రస్తుతం 8వ రోజు దుర్గాదేవిగా అలంకరించి పాయసం, చక్కెర పొంగలి పెట్టారు. శుక్రవారం మహిషాసుర మర్దినిగా వడపప్పు, పానకం, పులిహోర, పాయసన్నం.. శనివారం రాజరాజేశ్వరీ దేవికి పాయసన్నం, పులిహోర, కొబ్బరి, అరటి సమర్పిస్తారు. నైవేద్యానికి వాడే వస్తువులన్నింటి ధరలు ప్రస్తుతం కొండెక్కి కూర్చొన్నాయి.

ఈ మూడేళ్లలో ప్రతి సెప్టెంబరులో ధరలిలా

సరకు (కేజీ)	2022	2023	2024
బియ్యం గ్రేడ్-1	52.40	58.50	62.00
బియ్యం గ్రేడ్-2	37.98	40.21	41.30
గోధుమ	39.60	41.70	43.50
కందిపప్పు	120.00	170.94	172.28
పెసర పప్పు	101.20	116.70	117.75
మినప	101.30	112.90	121.75
శనగ	71.50	82.50	107.63
వేరుశనగ	32.60	39.60	34.00

(ఇవి కాకుండా పసుపు 2022 సెప్టెంబరులో కిలో రూ.225 ఉంటే 2023లో 243, ఇప్పుడు 260 ఉంది. కారం రెండేళ్ల క్రితం కిలో రూ.310 కాగా గతయేడాది సెప్టెంబరులో 361, ఇప్పుడు 380 ఉంది. బెల్లం గతంలో రూ.47.80 ఉండగా ఇప్పుడు రూ.53.50)



భారమైనా.. భక్తితో..

పండగల వేళ కృత్రిమ కొరతలు సృష్టించడం.. నిత్యావసరాల ధరలకు రెక్కలు రావడం సాధారణమైంది. కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో కూరగాయలు, ఇతర నిత్యావసరాల ధరలు భారమయ్యాయి. హోల్‌సేల్, రిటైల్ దుకాణాల ధరలకు బోలెడు వ్యత్యాసం ఉంటోంది. కీలక శాఖలు ఆశించిన రీతిలో దృష్టిసారించడంలేదు. ఈ పరిస్థితి కట్టడిచేస్తే అన్ని వర్గాలకూ కాస్త వెసులుబాటు దక్కేవీలుంది.

413 మద్యం దుకాణాలు 7597 దరఖాస్తులు



ఆన్‌లైన్ విధానాన్ని తెలుసుకుంటున్న డిప్యూటీ కమిషనర్ చైతన్యకుమార్

పిఠాపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 413 మద్యం దుకాణాలకు 7,597 దరఖాస్తులు వచ్చాయి. పిఠాపురం ఎక్సైజ్ కార్యాలయం వద్ద గురువారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్ చైతన్యకుమార్ మాట్లాడారు. జిల్లాలో ఎక్కడైనా, ఏ దుకాణానికైనా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని.. శుక్రవారం వరకు గడువు ఉందన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో ఈనెల 14న లాటరీ ఉంటుందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ రేణుక, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మౌనిక, పిఠాపురం ఎక్సైజ్ సీఐ శివ రామరాజు పాల్గొన్నారు.

విదేశాల నుంచి.. మద్యం దుకాణాల కోసం విదేశాల నుంచి దరఖాస్తులు వస్తున్నాయి. తునిలో 20 దరఖాస్తులు అమెరికా నుంచి వచ్చాయి. పలు ప్రాంతాల్లో యూఏఈ నుంచి అందాయి. వారంతా ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు. ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకునే వీలుండటంతో ఉన్నచోటు నుంచే నమోదు చేసుకున్నారు.

మంత్రి పట్టుకుంటారు.. వీరు మిన్నకుంటారు

▌నాదెండ్ల తనిఖీల్లో వెలుగుచూస్తున్న రేషన్ అక్రమాలు ▌సాధారణ రోజుల్లో సిబ్బంది పరిశీలన అంతంతే

ఈనాడు, రాజమహేంద్రవరం: రేషన్ దందా అడ్డగోలుగా సాగుతున్నా.. పేదల బియ్యం విదేశాలకు తరలించేస్తున్నా పట్టని రీతిలో యంత్రాంగం ఉంటోంది. పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీల్లో అక్రమ బియ్యం పట్టుబడుతున్నాయి. స్థానిక సిబ్బందీ ఇదేమాదిరి దృష్టిపెట్టి ఉంటే అక్రమార్కులకు ఎప్పుడో కళ్లెం పడి ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి నాదెండ్ల ఆ తర్వాత నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లోని నాలుగు మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 96,270 కిలోల అక్రమ బియ్యం నిల్వలు గుర్తించారు. మరి సాధారణ రోజుల్లో సంబంధిత సిబ్బంది ఎందుకు వీటి జోలికి వెళ్లడంలేదన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోతోంది. మంత్రి మనోహర్ గత పర్యటనలోనూ కాకినాడ పోర్టులో ఇదే తరహాలో తనిఖీలు చేసి 52 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమ నిల్వలు గుర్తించారు. అందులో దాదాపు 25 వేల క్వింటాళ్లు చౌక బియ్యం ఉన్నట్లు తేల్చారు.

జిల్లా	ఎండీయూలు	కార్డులు	సరఫరా చేసిన బియ్యం (కిలోలు)
తూర్పుగోదావరి	364	5,74,907	3,56,891
కాకినాడ	420	6,54,593	4,58,953
కోనసీమ	355	5,47,723	3,25,365

ఆఫ్రికా దేశాలకు..

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నల్లజర్ల-దేవరపల్లి మీదుగా చౌక బియ్యం లారీల్లో తరలుతున్నాయి. గతంలో విజిలెన్స్, ఇతర అధికారులు దాడులు చేసి సీజ్ చేసిన బియ్యంపైనా సరైన నిఘా లేదు. దేవరపల్లిలోని వరలక్ష్మి మిల్లులో సీజ్ చేసిన 270 కిలోల రేషన్ బియ్యం ఉంచగా వాటిని దుర్వినియోగం చేసినా సిబ్బంది పట్టించుకోలేదు.



నల్లజర్లలో బుధవారం రాత్రి బియ్యం తనిఖీ చేస్తున్న మంత్రి నాదెండ్ల

జిల్లాలో గుర్తించిన సీఎంఆర్ మిల్లుల్లో కొన్నేళ్లుగా సమర్థంగా తనిఖీలు లేవు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించేవారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన నిల్వలు, మిల్లింగ్ చేసి పంపిన బియ్యం, మిల్లు రోజువారీ కార్యకలాపాల రిజిస్టర్లు తనిఖీలు చేసేవారు. వైకాపా అయిదేళ్ల పాలనలో ఈతరహా తనిఖీలు మరుగునపడ్డాయి.

సొమ్ము ఇచ్చుకో.. పదోన్నతి పుచ్చుకో

▌పంచాయతీ ఉద్యోగుల బదిలీల్లోనూ కాసుల వేట ▌ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో వణుకు

ఈనాడు, కాకినాడ, రాజమహేంద్రవరం: జిల్లా, డివిజనల్ పంచాయతీ కార్యాలయాల్లో కొందరు ఉద్యోగుల లెక్కే వేరు. పదోన్నతులు, బదిలీలు, ఒప్పంద సిబ్బంది ఉత్తర్వులు, విచారణలు, అధికారుల పర్యటనలు ఇలా ఏ పని సాఫీగా సాగాలన్నా అడిగినంత సమర్పించాల్సిందే అన్నట్లుగా తయారైంది. తాజా పదోన్నతులు, బదిలీల్లో అక్రమ వసూళ్ల వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. విచారణ జరిపించి నివేదికలు పంపాలని మూడు జిల్లాల కలెక్టర్లకు ఆదేశించడంతో వ్యవహారం వేడెక్కింది.

వసూల్ రాజాలు ఎవరు..?

ఉమ్మడి జిల్లాలో గత నెలలో 55 మంది గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్- 2 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించారు. ఒక్కొక్కరి దగ్గర్నుంచి రూ.18వేల చొప్పున వసూలు చేశారన్నది ఆరోపణ. గ్రేడ్-4 నుంచి గ్రేడ్-3 పదోన్నతులకు రూ.17వేల చొప్పున తీసుకున్నట్లు సమాచారం. ఆయా కార్యాలయాల్లో చక్రం తిప్పిన ఉద్యోగులు ఈ రేటు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ● కాకినాడ జిల్లాలో రాజకీయ వాసనతో ఉద్యోగం వెలగబెడుతున్న ఓ కీలక ఉద్యోగి.. ఏళ్లుగా పాతుకుపోయి ఇటీవల బదిలీ అయిన మరో ఉద్యోగి అక్రమ వసూళ్లలో చక్రం తిప్పారు.. కొందరు ఉద్యోగులు సిఫార్సు లేఖలు తెచ్చినా, అడిగినంత ఇస్తేనే ఇక్కడి వ్యవహారం సాగిందనే వాదనలూ వినిపిస్తున్నాయి. ● తూర్పు గోదావరి జిల్లాలో కొందరు తమకు నచ్చిన స్థానాల్లో కొలువుకు పరస్పర అంగీకారం, నాయకుల సిఫార్సు లేఖలతో పైరవీలు చేశారు. కార్యదర్శుల బదిలీల్లో పెద్ద ప్రహసనమే సాగింది. ప్రత్యేక అధికారుల పాలన, స్థిరాస్తి వ్యాపారం దండిగా జరిగి, ఆదాయం వచ్చే పంచాయతీల్లో పాగా వేసేందుకు ప్రయత్నాలు సాగాయి. ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి నాయకుల సిఫార్సు లేఖలతో పైరవీలు సాగించారు. ఇటీవల ఓ ఎమ్మెల్యే తాను 57 లేఖలిస్తే మూడింటినే ఆమోదించారని పేర్కొనడంపై చర్చ నడుస్తోంది. ● కోనసీమలో అంతర్గత బదిలీలు 86, ఇతర జిల్లాల నుంచి 17 మంది వచ్చారు. వీరి బదిలీల్లోనూ సిఫార్సులు, ఆమ్యామ్యాలు పనిచేశాయి.



మత్స్యకారులకు.. మంచి రోజులు వచ్చేనా..?

న్యూస్‌టుడే, అల్లవరం

జిల్లాలోని ఓడలరేవు జెట్టీ, అంతర్వేది పాలెం మినీ హార్బర్ పనులు ఎక్కడికక్కడ నిలిచి పోయి అయిదేళ్లు కావస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఓడరేవులపై మత్స్యకారుల్లో ఆశలు రేగుతున్నాయి. ఇటీవల అధికారులు పర్యటిస్తుండటంతో పనులు పట్టాలెక్కుతాయని భావిస్తున్నారు.



అల్లవరం మండలం ఓడలరేవులో అసంపూర్తిగా ఉన్న జెట్టీ నిర్మాణం

70 శాతం పనులు: జిల్లాలోని 9 తీర ప్రాంత మండలాల్లో 7 బోట్ ల్యాండింగ్ సెంటర్లు ఉన్నాయి. 2016-17 మధ్య తెదేపా ప్రభుత్వం చేపల రేవులు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2019లో సార్వత్రిక ఎన్నికల నాటికి 70 శాతం పనులు పూర్తి చేశారు. వైకాపా నిర్లక్ష్యం: వైకాపా పాలనలో దీనిని విస్మరించారు. 2019 ఎన్నికల ముందు వరకు ఎంత మేర పనులు జరిగాయో అక్కడే నిలిచి పోయాయి. అయిదేళ్లు వీటివైపు కన్నెత్తి చూడలేదు.

జిల్లాలో వివరాలు..	
తీర ప్రాంతం:	92 కి.మీ.
తీర గ్రామాలు:	9
మత్స్యకార గ్రామాలు:	40
జిల్లాలో బోట్లు:	1,925
వేటకు వెళ్తున్న మత్స్యకారులు:	11,000

రెండు చోట్లు: అంతర్వేదిలో రూ.30 కోట్లలో మినీ హార్బర్, అల్లవరం మండలం ఓడలరేవులో రూ.5 కోట్లతో జెట్టీ నిర్మాణం ప్రారంభించారు. అంతర్వేదిలో విద్యుత్తు ఉపకేంద్రం, వలలు బాగు చేసుకునే భవనం, మంచినీటి సదుపాయం, ప్లాట్ ఫార్మ్ నిర్మించాల్సి ఉంది. ఓడలరేవులో జెట్టీ మాత్రమే 70 శాతం పూర్తి చేశారు. ఇతర సదుపాయాలకు సంబంధించి నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు.


వేల మందికి ఉపయోగం..

ఈ రెండు జెట్టీల ద్వారా జిల్లాలో మత్స్యకారులతో పాటు విశాఖ, శ్రీకాకుళం వంటి ఇతర జిల్లాలకు చెందిన వారూ వేట సాగిస్తున్నారు. మత్స్య ఉత్పత్తులు విక్రయించేందుకు సరైన వసతులు లేక మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. చేపలు నిల్వ చేసుకునే శీతలీకరణ గోదాములు ఏర్పాటు చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

బడి నిర్వహణ చతికిల

నిధులు నిలిపేసిన గత ప్రభుత్వం

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్



విద్యారంగాన్ని ఉద్ధరిస్తున్నామని ఊదరగొట్టిన గత ప్రభుత్వం సంక్షోభం వైపు నడిపించింది. క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణకు నిధులు విదల్చలేదు. సమస్యల్ని పరిష్కరించకుండా కుప్పలుతెప్పలు చేసింది. వివిధ పథకాల పేర్లు చెప్పి కాలం వెల్లదీసింది. పాఠశాలల నిర్వహణ సమస్యలు తలెత్తడంతో ఆ ప్రభావం బోధనపై పడే ప్రమాదం ఉంది. కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాత విధానాలకు తిలోదకాలిచ్చి..

2014-19 మధ్య తెదేపా అధికారంలో ఉండగా విద్యావ్యవస్థకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రతి క్లస్టర్ రిసోర్స్ సెంటర్‌కు నాలుగు రకాల నిధులు మంజూరయ్యేవి. కంటిజెన్సీ, మీటింగ్ టీఏ, నిర్వహణ గ్రాంట్, విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.25 వేల నుంచి రూ.3 లక్షల వరకు నిర్వహణ నిధులు మంజూరు చేసేవారు. ఆ సొమ్మును తరగతి గదులు, మరుగుదొడ్లు, నీటి ట్యాంకులు, ఇతర మరమ్మతులు, పాఠశాల నిర్వహణ పనులకు వినియోగించేవారు. రెండేళ్లుగా ఈ నిధుల ఊసే లేక ప్రధానోపాధ్యాయులు తమ సొంత డబ్బులు వెచ్చించవలసి వస్తోంది.



అమలాపురం పట్టణంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా వివరాలు (రూ.కోట్లలో..)

విద్యా సంవత్సరం	రావాల్సిన నిధులు	విడుదల అయినవి
2022-23	4.85	1.29
2023-24	4.90	0
2024-25 (ఇప్పటి వరకు..)	4.90	0

త్వరలోనే విడుదల

ఈ నిధుల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. త్వరలోనే విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

- రాంబాబు, సమగ్ర శిక్ష అధికారి

32 నీటి సంఘాలకు ఎన్నికలు

అమలాపురం కలెక్టరేట్: కోనసీమ వ్యాప్తంగా 5 డిస్ట్రిబ్యూటరీలు, 32 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఒక్కొక్క వినియోగదారుల సంఘంలో 12 టెరిటోరియల్ నియోజక వర్గాలు ఉంటాయన్నారు. ఒక్కొక్క టీసీలో 600 నుంచి 700 ఎకరాల ఆయకట్టు ఉంటుందన్నారు. ఈ నెల 16న నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. నవంబరు 5 నాటికి ఓటర్ల జాబితా తయారీ పూర్తి చేయాలన్నారు. సీసీఆర్ కార్డులు ఉన్న కౌలు రైతులకూ ఓటు హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలి

అమలాపురం కలెక్టరేట్: కోటిపల్లి- నరసాపురం రైల్వే లైన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో పనులపై సమీక్ష నిర్వహించారు. శివకోడు వద్ద గెయిల్ పైప్ లైన్ అడ్డుగా ఉండటంతో పైవంతెన నిర్మించాల్సిన అవసరం ఉంటుందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. మలికిపురం మండలం గుడిమెళ్లంకలో పంచాయతీ చెరువు మధ్య నుంచి లైన్ వెళ్తుందన్నారు. గ్రామస్థులను ఒప్పించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ రైల్వే లైన్‌కు శంకుస్థాపన చేసి 24 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ పూర్తి కాకపోవడం బాధాకరమన్నారు. నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జేసీ నిశాంతి, ఆర్డీవోలు మాధవి, శ్రీకర్, కలీబ్ కౌశర్ బానో, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిశాంతి



కొళాయి జలం.. కాలువలో గరళం

అమలాపురంలోని వడ్డిగూడెంరోడ్డులోని పరిస్థితి ఇది. శివారు ప్రాంతం కావడంతో కొళాయిల నుంచి నీటి ధార తక్కువగా వస్తోంది. భూమి స్థాయిలో నీరు పట్టుకునేందుకు గుంతలు తీసి ఇలా ఏర్పాటు చేసుకున్నారు. పక్కనే మురుగుకాలువ ఉండటంతో వర్షం కురిస్తే నీరు కలుషితం అవుతుందని స్థానికులు చెబుతున్నారు.

-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

కేరళ బృందం పర్యటన



కోడూరుపాడులో పర్యటిస్తున్న కేరళ బృంద సభ్యులు

అల్లవరం: సేంద్రియ సాగు విధానాన్ని పరిశీలించేందుకు అయిదుగురు సభ్యులతో కూడిన కేరళ బృందం గురువారం కోడూరుపాడులో పర్యటించింది. స్థానిక రైతుల నుంచి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. కేరళ నుంచి వచ్చిన వారిలో వినోద్, రజిని, కవిత, అప్పుకుట్టి, గిరిజ, ఇక్కడి అధికారులు సత్యనారాయణ, జి.శ్రీనివాస్, చంద్రబాబు, సింహాద్రి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధికి అనుసంధానం.. కొబ్బరికి ఊతం

న్యూస్‌టుడే, అంబాజీపేట

ప్రస్తుతం ఉపాధిహామీ పథకాన్ని ఉద్యాన పంటలకు అనుసంధానం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకొంది. కోనసీమలో కొబ్బరి విస్తీర్ణం దృష్ట్యా తోటలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని రైతులు డిమాండు చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ పథకంలో కేవలం చెట్ల చుట్టూ పళ్లాలు వేసేలా మాత్రమే పనులు చేయిస్తున్నారు. కోనసీమలో ఏర్పడిన కూలీల కొరత కారణంగా రైతులు ఇబ్బందులను చవిచూస్తున్నారు. ఈ తరుణంలో ఉపాధి కూలీలను కొబ్బరి కాయల దింపుతీసే సమయంలోను, ఎరువులు వేసేటప్పుడు, కలుపుతీత తదితర పనులకు 'టైమ్‌రేట్ బేసిస్' పద్ధతి ప్రకారం ఎం.బుక్ రికార్డు చేసి వారికి పనులు కల్పించాలని రైతులు కోరుతున్నారు. ఈ పద్ధతి ద్వారా కూలీలకు వంద రోజుల పనితో పాటు రైతులకు అదునులో వ్యవసాయ పనులు జరిగి పంట ఉత్పత్తులను పెంచుకునే అవకాశం ఉంటుందంటున్నారు.

కోనసీమలో కొబ్బరి సాగు వివరాలిలా..

తోటల విస్తీర్ణం:	54,539 హెక్టార్లు
దిగుబడి:	107.82 కోట్లు టన్నులు
కాయల దిగుబడి:	ఎకరానికి సగటున 7,908 కాయలు
వ్యాపారం:	రూ.736.27. కోట్లు
ఉత్పాదకత:	9,354 కిలోలు(హెక్టార్)
రైతులు:	70 వేల మంది
కార్మికులు:	2 లక్షల మంది



కొబ్బరి చెట్లకు పళ్లాలు కడుతున్న కూలీలు

అమలైతే ఎంతో మేలు

కోనసీమలో కొబ్బరి తోటలు ఎక్కువగా ఉన్నాయి. కమతాల్లో పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. ఈ సమయంలో ఉపాధిహామీ పథకం కూలీలతో పనులు చేయించేందుకు అవకాశం కల్పిస్తే మేలు జరుగుతుంది.

- పత్తి దత్తుడు, రైతు, కొర్లపాటివారిపాలెం



చక్రధరరావు ఏర్పాటుచేసిన స్టాల్‌లో చీరలను పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ ఎం.బీనా

దిల్లీ చేనేత, హస్తకళల ప్రదర్శనలో తాటిపర్తి కార్మికుడు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: దిల్లీలో ఏర్పాటుచేసిన చేనేత, హస్తకళల ప్రదర్శనలో గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు అంజూరి సుబ్రహ్మణ్య చక్రధరరావు స్టాల్‌ను ఏర్పాటుచేసి ఉప్పాడ, తాటిపర్తి, ఇతర చేనేత చీరలను ప్రదర్శించారు. దేశవ్యాప్తంగా చేనేత, హస్తకళల ప్రదర్శనలో మొత్తం 26 స్టాళ్లను ఏర్పాటుచేయగా ఆంధ్రప్రదేశ్ నుంచి చక్రధరరావుకు చేనేత విభాగంలో అవకాశం కల్పించారు. ఈనెల 7వ తేదీన ప్రారంభమైన ప్రదర్శన 20వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. చక్రధరరావు ఏర్పాటుచేసిన స్టాల్‌లో వివిధ రకాల చీరలను భారత ప్రభుత్వ చేనేత మంత్రిత్వశాఖ అభివృద్ధి కమిషనర్ డాక్టర్ ఎం.బీనా, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత, రేఖారాణి తదితరులు ప్రదర్శనను తిలకించారు.

ఇద్దరూ.. ఇద్దరే

కిక్‌బాక్సింగ్‌లో అంతర్జాతీయ స్థాయి రిఫరీలుగా గురుశిష్యులు

న్యూస్‌టుడే, రామచంద్రపురం

పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని అందుకోవచ్చని నిరూపిస్తున్నారు రామచంద్రపురం పట్టణానికి చెందిన గురు శిష్యులు బి.కె.రత్నం, వై.అంజనికుమార్. రామచంద్రపురం నుంచి కిక్‌బాక్సింగ్‌లో అంతర్జాతీయస్థాయి రిఫరీలుగా ఎంపికై 2026 వరకు ప్యానల్ రిఫరీలుగా ఆంధ్రప్రదేశ్ తరఫున వ్యవహరిస్తున్నారు.. గురువు రత్నం 20 ఏళ్లు కోచ్‌గా రిఫరీగా వ్యవహరించిన అనుభవంతోనూ, శిష్యుడు అంజనికుమార్ 10ఏళ్ల కోచ్, రాష్ట్రస్థాయి రిఫరీ అనుభవంతోనూ ఇద్దరు ఇంటర్నేషనల్ స్థాయికి ఎదిగారు.



దిల్లీలో ఇంటర్నేషనల్ రిఫరీ ధ్రువపత్రం తీసుకుంటున్న బల్లిపాటి కెంపు రత్నం

ఒక్కో మెట్టు ఎక్కుతూ...

ఈ ఇద్దరికి రాష్ట్రస్థాయి రిఫరీలుగా చేసిన అనుభవం కలిసొచ్చింది. న్యూ దిల్లీలో 2024 ఫిబ్రవరి 7 నుంచి 11వ తేదీ వరకు కె.డి జాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ రిఫరీ సెమినార్ జరిగిన పోటీలో సత్తాచాటి కిక్ బాక్సింగ్ ఇండియా ప్రెసిడెంట్ సంతోష్ కె.అగర్వాల్ నుంచి రిఫరీలుగా ధ్రువపత్రాలు స్వీకరించారు. ఊటీలో 2024 ఏప్రిల్ 19 నుంచి 28వ తేదీ వరకు 7వ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ శిక్షణ శిబిరంలో జాతీయ స్థాయి కోచ్‌లుగా లైసెన్సులు సాధించారు.

ఆయన రత్నమే..

రామచంద్రపురం పట్టణానికి చెందిన బల్లిపాటి కెంపు రత్నం కరాటే కుంగ్‌ఫూలో రాణించడమే కాకుండా మాస్టర్‌గా వ్యవహరించారు. వాకో ఇండియా కిక్ బాక్సింగ్ థర్డ్ డిగ్రీ బ్లాక్ బెల్ట్ చేశారు. కరాటేలో 5వ బ్లాక్ బెల్ట్ సాధించారు. ఇంటర్నేషనల్ లైసెన్స్ కోచ్‌గా వాకో ఇంటర్నేషనల్ రిఫరీ, జడ్జిగా కరాటే ఇండియా ఆర్గనైజింగ్ రిఫరీగా వ్యవహరిస్తున్నారు. సాహస వీర అవార్డు పొందడమే కాకుండా వాకో ఇండియా రిఫరీ, జడ్జిగా టాటామీ స్పోర్ట్స్‌లో అర్హత సాధించారు. ఒక పక్క తన కులవృత్తి బార్బర్‌గా పని చేస్తూనే రత్నం అంతర్జాతీయ రిఫరీగా ఎదిగారు.

మాస్టర్ బాటలోనే అంజని కుమార్



తన మాస్టర్ రత్నం బాటలోనే రామచంద్రపురం పట్టణానికి చెందిన యండమూరి అంజని కుమార్ 24 సార్లు బ్లాక్ బెల్ట్ గ్రాండ్ ఛాంపియన్ షిప్ సాధించారు. ఆల్ ఇండియా యూనివర్సిటీ కిక్‌బాక్సింగ్‌లో పతకాన్ని సాధించారు. వాకో ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ లైసెన్స్ కోచ్‌గా రింగ్ స్పోర్ట్స్‌లో ఎదిగారు. వాకో ఇండియా నేషనల్ రిఫరీ, జడ్జిగా రింగ్ స్పోర్ట్స్‌లో వ్యవహరించారు. సెకండ్ డిగ్రీ బ్లాక్ బెల్ట్ సాధించారు. కరాటే ఇండియా ఆర్గనైజింగ్ జడ్జి-ఎగా వ్యవహరించారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తూ కిక్‌బాక్సింగ్ అంతర్జాతీయ రిఫరీగా ఎదిగారు.

బి.కె.రత్నం టాటామీ కోచ్‌గాను, అంజినీ కుమార్ రింగ్ స్పోర్ట్స్‌గా, అంతర్జాతీయ కోచ్‌లుగా ఎంపికయ్యారు. త్వరలో మైసూర్‌లో ఈ ఏడాది నవంబరు 10 నుంచి 14వ తేదీ వరకు జరగబోయే ప్రో నేషనల్స్ కిక్ బాక్సింగ్ పోటీలకు రిఫరీగా అంజనికుమార్ వెళ్లేందుకు ఎంపికయ్యారు.

పాపికొండలు యాత్రలో జాగ్రత్తలు పాటించాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : గండిపోచమ్మ, పోచవరం పాయింట్ల నుంచి పేరంటాలపల్లి వరకు ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ నిర్వహిస్తున్న బోటింగ్ కార్యకలాపాల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకుడు వి.స్వామినాయుడు సూచించారు. పాపికొండలు విహార యాత్ర విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పర్యాటకశాఖ అధికారులు, ప్రైవేటు బోటు ఓనర్లతో రాజమహేంద్రవరంలో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ప్రైవేటు బోటు ఆపరేటరు బోటుకు సంబంధించి పర్యాటకశాఖ నుంచి నిరభ్యంతర పత్రం, ఇరిగేషన్ శాఖ నుంచి రూట్ పర్మిషన్, మారిటైం బోర్డు నుంచి బోటు లైసెన్స్ పొంది ఉండాలన్నారు. ప్రతి బోటులో లైఫ్ సేవింగ్, ఫైర్ ఫైటింగ్ పరికరాలు ఉండాలన్నారు. గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్లరాదని ఓనర్స్ అసోసియేషన్ సభ్యులకు సూచించారు. ప్రయాణికుల చిరునామా, మొబైల్ నంబరుతో పూర్తి వివరాలు నమోదు చేయాలని కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఆదేశించారు. పరిమితికి మించి సందర్శకులను అనుమతించరాదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలుంటాయని సిబ్బందిని హెచ్చరించారు. ప్రైవేటు బోటులో పనిచేసే సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు. లైసెన్స్ పొందిన డ్రైవర్లు మాత్రమే బోట్లు నడపాలన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం: ఎంపీ బోస్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: చదువుతోపాటు క్రీడలు మాత్రమే విద్యార్థిని అందలం ఎక్కిస్తాయని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. 9వ అంతర్ జిల్లాల సబ్ జూనియర్స్ బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీల ప్రారంభోత్సవ సభ గురువారం రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడ ప్రాంగణంలో జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా ఎంపీ బోస్ పాల్గొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం బాస్కెట్‌బాల్ పోటీలను వారు ప్రారంభించారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి 11 బాలుర జట్లు, 8 బాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. క్రీడలకు ముందు చిన్నారులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, డాక్టర్ చెలికాని రామారావు, డాక్టర్ కోట సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ బోస్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాధంశెట్టి తదితరులు

ఏపీ ఆర్‌సెట్ మొదటి విడత సీట్ల కేటాయింపు

తిరుపతి (బైరాగిపట్టెడ): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపీ ఆర్‌సెట్ 2023-24లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు గురువారం మొదటి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టినట్లు సెట్ ఛైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు, కన్వీనర్ ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్రంలోని 17 వర్సిటీల్లో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర కోర్సుల్లో 2,566 పీహెచ్‌డీ ఖాళీలకుగాను తొలిదశలో ఫుల్‌టైం కోర్సుల్లో 771 మంది, పార్ట్ టైం కోర్సుల్లో 1,237 మందికి సీట్ల కేటాయింపు చేపట్టినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో రిపోర్టు చేశాక సంబంధిత విశ్వవిద్యాలయాల్లో ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు నేరుగా హాజరు కావాలని, వివరాలకు http://ets.apsche.ap.gov.in వెబ్‌సైట్ చూడాలని కోరారు.


‘లోపభూయిష్టంగా కేంద్ర పథకాల అమలు’

కాకినాడ కలెక్టరేట్: జిల్లాలో అమలవుతున్న కేంద్ర పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పరిశీలనకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ జాతీయస్థాయి మానిటరింగ్(ఎన్ఎల్ఎం) బృందాన్ని పంపింది. కేరళలోని కొట్టాయంకు చెందిన సెంటర్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ నుంచి ఎల్ఎన్ఎం ప్రతినిధులు టీవీ తిలకన్, సలిమాన్ ఈనెల 3 నుంచి 9 వరకు జిల్లాలో పర్యటించారు. డ్వామా, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, హౌసింగ్, విద్య, గ్రామ పంచాయతీ విభాగాలను వీరు పరిశీలించారు. గురువారం కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పథకాల అమలు కొంత లోపభూయిష్టంగా జరుగుతుందని, సరిదిద్దాలన్నారు. డ్వాక్రా సంఘాల పుస్తక నిర్వహణ సక్రమంగా జరగట్లేదన్నారు. బుక్ కీపింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద నిర్మించిన కొన్ని గృహాలకు సుమారు రూ.30 లక్షలు వెచ్చించారని, ఇంత స్తోమత ఉన్నవారికి ఈ పథకంలో ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. గ్రామాల సరిహద్దులపై సమగ్ర నివేదిక తయారు చేయాలన్నారు. గ్రామీణ రహదారులను మరింత అభివృద్ధి చేయాలన్నారు. డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, పరిపాలనాధికారి వర్ధనపు అబ్రహాం లింకన్, డీఆర్‌డీపీ డీపీఎం తోట అశోక్‌భరత్, తదితరులు పాల్గొన్నారు.



డ్వామా కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న ఎన్ఎల్ఎం బృందం

నమామి దుర్గే



దుర్గాష్టమి సందర్భంగా గురువారం దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చిన ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

ఆదాయ పన్ను చెల్లింపుదార్లతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఆదాయ పన్ను చెల్లింపుదార్లు దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రధములని ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. నాగమల్లి జంక్షన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా భవనంలో గురువారం ‘ఆదాయపు పన్నులు- వివాద్ సేవ విశ్వాస్ -2024’పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విధిగా ఆదాయ పన్ను చెల్లించాలన్నారు. చెల్లింపులో చట్టపరమైన వివాదాలు ఎదుర్కొంటున్న వారు కేంద్రం ప్రవేశపెట్టిన వివాద్ సేవ విశ్వాస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అనురాధ కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఆదాయపు పన్ను సంయుక్త అధికారి బి.హేమభూపాల్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు తప్పనిసరిగా చెల్లింపుల పత్రాలను పరిశీలించాలన్నారు. సహాయాధికారి జి.తిరుపతిరావు మాట్లాడుతూ ఇందులో సీఏ పాత్ర కీలకమన్నారు. ఎస్ఐఆర్‌సీ వైస్ ఛైర్మన్ పీఎస్ఎన్ మూర్తి, ఎక్స్ అఫిషియో జి.నరేష్ చంద్ర, వి.రాధా, సీవీవీ గంగారామ్, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

70వేల మందితో కుంకుమపూజ

సర్పవరం జంక్షన్: స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో రమణయ్యపేట శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక సమేత కామేశ్వరస్వామి గోశాల ప్రాంగణంలో గురువారం దేవీ నవరాత్రులు నిర్వహించారు. మహాశక్తి యాగం 8వ రోజు ఐశ్వర్యాంబిక అమ్మవారికి జగజ్జననీదేవి అలంకరణ చేశారు. ప్రాంగణంలో సుమారు 70వేల మంది ఆడపడుచులు ఎరుపు రంగు చీరలు ధరించిన మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. శతకోటి కుంకుమార్చన 90 కోట్లకు చేరిందని, దేశంలో మొదటి సారి 70 వేల మంది కుంకుమపూజలు నిర్వహించడం జరిగిందని స్వామీజీ తెలిపారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు

మహిళలను మోసం చేసిన నిందితురాలి అరెస్టు



నిందితురాలి వివరాలు వెల్లడిస్తున్న సామర్లకోట సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: మహిళలకు మాయ మాటలు చెప్పి వారి వద్ద నుంచి బంగారు వస్తువులు తీసుకుని మోసం చేసి తప్పించుకు తిరుగుతున్న నిందితురాలిని సామర్లకోట పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణభగవాన్ గురువారం వివరాలు వెల్లడించారు. సామర్లకోటకు చెందిన ఓ మహిళ (35) సామర్లకోట మండలం జి.మేడపాడు, రంగంపేట మండలం వీరంపాలెం పాకలు, కంతవరం మండలం కర్తవ్యపాడులో మహిళలకు ఉద్యోగాలు ఇప్పిస్తానని వారిని మాయమాటలతో నమ్మించింది. వారి వద్ద నుంచి బంగారు, వెండి వస్తువులు తీసుకుని మోసం చేసి తప్పించుకు తిరుగుతోంది. దీంతో తమను మోసం చేసిందని ఆయా పోలీస్ స్టేషన్లలో బాధితులు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, ఎస్ఐ, సామర్లకోట క్రైం సీఐ అంకబాబు, సిబ్బంది ప్రత్యేక బృందంగా నిర్వహించారు. సామర్లకోట వెంగానంలో ఆరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 34.8 గ్రాముల బంగారు వస్తువులు, 10 తులాల వెండి వస్తువులను రికవరీ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు వివరించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాల్లో)	ధర (రూపాయల్లో)
కొత్తకాయ పెద్ది (వెయ్యిటికి)	11,500
పాతకాయ గండేరా	17,500
గటరా	15,500
కొత్తకాయ గండేరా	16,500
గటరా	14,500
పచ్చి కాయ (వెయ్యికి)	14,000-15,000
కొబ్బ (కిల్ల)	13,500-14,000
కొబ్బరి నూనె	3,750
15 కిలోలు	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మారుతాయి.

వెంకటేశ్వర చికెన్ ధర కిలో రూపాయల్లో

ఫారంకోడి	120-00
చిల్లర్ లైవ్	142-00
స్కిన్	206-00
స్కిన్‌లెస్	234-00

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-25 పైII

అనపర్తి ఆఫీసు: 08857-226908

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అంబాజీపేట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అండర్-14, 17, 19 తైక్వాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారులు ప్రతిభ చూపి వెండిపతకాలు సాధించినట్లు జిల్లా తైక్వాండో శిక్షకుడు పితాని త్రిమూర్తులు గురువారం తెలిపారు. ఈ నెల 4, 5 తేదీల్లో రైల్వేకోడూరులో జరిగిన అండర్-19 స్కూలు గేమ్స్‌లో చైతన్య వెండి పతకాన్ని సాధించాడు. 6, 7, 8 తేదీల్లో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన అండర్-14, 16 విభాగాల్లో ఎం.మౌనిక వెండి, బీహెచ్. రితిక్ బ్రౌన్ పతకాలు సాధించారని ఆయన చెప్పారు. ఈ క్రీడాకారులను ఎస్సై చిరంజీవితో పాటు ఎంఈవోలు వెంకటేశ్వరరావు, ప్రకాష్, ఎస్ఎంసీ వైస్ ఛైర్మన్ బండారు అమ్మాజీ తదితరులు అభినందించారు.



ధ్రువపత్రాలతో విజేతలు

నదీజలాలతో బాబాకు అభిషేకం

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలులోని సాయిబాబాకి గురువారం నదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. వశిష్ట గోదావరి నుంచి శత కలశాలతో జలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అభిషేకం చేశారు. అనంతరం దత్తాత్రేయుడికి అర్చన జరిపించారు. సాయంత్రం బాబా వారి సత్సంగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



బిందెలతో నీళ్లు తెచ్చి అభిషేకిస్తున్న భక్తులు...

గ్రామ ప్రగతికి రహదారుల అభివృద్ధి

14 నుంచి పల్లె పండగ

మలికిపురం, అంబాజీపేట, న్యూస్‌టుడే

గత వైకాపా నిర్వాకం వల్ల గ్రామాల్లో రహదారులు రాళ్లు తేలి, గుంతలు పడి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పంచాయతీలకు అందించాల్సిన ఆర్థిక సంఘం నిధులను మళ్లించడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడింది. ఎన్నార్ఈజీఎస్ నిధులతో అవసరం లేని భవనాల నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా విడిచిపెట్టడంతో ప్రస్తుతం అవి మొండి గోడలతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రహదారుల అభివృద్ధికి బాటలు వేస్తోంది.

మండలం	మొత్తం పనులు	మంజూరైన నిధులు(రూ.కోట్లలో)
మలికిపురం	64	3.91
సఖినేటిపల్లి	67	3.13
రాజోలు	50	3.01
మామిడికుదురు	64	3.24
అంబాజీపేట	48	3.00
పి.గన్నవరం	46	3.00
అయినవిల్లి	59	3.24



సీసీ రహదారిగా అభివృద్ధి చేయనున్న పేముల కాలువ గట్టు మార్గం

గ్రామ సభల్లో గుర్తించి..

గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను గుర్తించడానికి ఆగస్టు 23న కూటమి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించింది. ఈ గ్రామ సభలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. గ్రామాల్లో రహదారుల అవసరాలను ఏకరవు పెట్టారు. వీటికి అనుగుణంగా ఆయా ప్రాంతాల్లోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి, రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దీనిలో భాగంగా దసరా పండగ అనంతరం ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు గ్రామీణ లింకు రోడ్ల అభివృద్ధికి 'పల్లె పండగ' కార్యక్రమాన్ని నిర్వహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అన్ని గ్రామాల్లోనూ రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడానికి నిర్ణయించింది. రాజోలు నియోజకవర్గంలో రూ. 11.29 కోట్లతో 206 పనులకు ప్రభుత్వ ఆమోదానికి ప్రణాళికలు రూపొందించారు. వచ్చే సంక్రాంతికి ఈ అభివృద్ధి కార్యక్రమాలన్నీ పూర్తి చేసి మళ్లీ పండగ నిర్వహించేలా కార్యక్రమాలను రూపొందించారు.

ఎన్నార్ఈజీఎస్ నిధులతో..

ఎన్నార్ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేసుకుంటూ ఆగస్టు 23న జరిగిన గ్రామ సభల్లో పనులకు ప్రతిపాదనలు చేశారు. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు, మామిడికుదురు, అయినవిల్లి, పి.గన్నవరం, అంబాజీపేట, మండలాల్లోని అన్ని గ్రామాల్లో రూ.22.53 కోట్లతో సీసీ రహదారులు తదితర పనులను చేపట్టనున్నారు.

ధరల పట్టిక ప్రదర్శించాలి

అంబాజీపేట, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని కూరగాయలు, కిరాణా, సూపర్ మార్కెట్ల వద్ద వినియోగదారులకు అర్థమయ్యేలా ధరలు పట్టికలు ఉంచాలని.. లేకపోతే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని ఎంఎస్‌వో ఎస్.సత్యనారాయణ, డీటీ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేటలో ఉన్న కిరాణా, కూరగాయలు, సూపర్ మార్కెట్లను గురువారం వారు తనిఖీ చేశారు. ఉల్లిపాయ, టమాట, బంగాళదుంపలు, వంటనూనె, పప్పుల ధరలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వినియోగదారులకు విక్రయించాలన్నారు. ఆర్ఐ కె.ఏడుకొండలు, వీఆర్వోలు రమణ, వెంకటేశ్వరరావు, ఐ.వి.వి.రమేష్, వీఆర్ఏ శ్రీనివాస్, రేషన్ డీలరు ఏడుకొండలు పాల్గొన్నారు.



కూరగాయల దుకాణాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

30వ రోజుకు చేరిన అధ్యాపకుల దీక్షలు

మలికిపురం: జీతాల కోసం మలికిపురంలోని డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం 30వ రోజుకు చేరింది. నెల రోజులుగా అధ్యాపకులు జీతాల కోసం ఆందోళన చేస్తున్నా పాలకవర్గం కనీసం పట్టించుకోకపోవడం దురదృష్టమని పలువురు నాయకులు అన్నారు. కరస్పాండెంట్, కోశాధికారి నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవతా దృక్పథం పాలకవర్గానికి లేకపోవడం దారుణమని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల పూర్వ విద్యార్థులు అధ్యాపకుల దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు.



రిలే నిరాహార దీక్షల్లో అధ్యాపకులు

మేమున్నాం.. మీకు తోడుగా

పూడికలు తొలగింపు

ఆత్రేయపురం: మండలంలోని తాడిపూడి గ్రామంలో డ్రెయిన్లో పూడికలు ఏర్పడటంతో ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచి ముదునూరి సుబ్బలక్ష్మి వద్ద ప్రస్తావించగా స్పందించారు. పూడికలు తీసి శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

తాగునీటి కొళాయిల ఏర్పాటు

మామిడికుదురు: పాశర్లపూడి పరిధిలోని బొమ్మిడిపాలెం శివారులో తాము తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి కొనుకు ప్రేమజ్యోతి వద్ద ప్రస్తావించగా ఆమె స్పందించారు. అక్కడ నివాసం ఉంటున్న కుటుంబాల వారికి తాగునీరు అందేలా కొళాయిలు ఏర్పాటు చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

ఉత్సవంలో అశ్లీల నృత్యాలు వద్దు: డీఎస్పీ

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేటలో ఈ నెల 16న పెద్ద ఎత్తున నిర్వహించే విజయ బేతాళస్వామి వారి వాహనమహోత్సవంలో ఎలాంటి అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేయవద్దని కొత్తపేట డీఎస్పీ జి.గోవిందరావు అన్నారు. ఈ వాహనమహోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. గురువారం అంబాజీపేటలోని కల్యాణ మండపంలో 13 శెట్టిబలిజపేటలకు చెందిన వాహనాల నిర్వాహకులతో సీఐ రుద్రరాజు భీమరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. డీఎస్పీ మాట్లాడుతూ.. వాహనాలపై సినిమా హీరోలు, రాజకీయ ప్రముఖుల ఫ్లెక్సీలను పెట్టవద్దన్నారు. అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాహనాల దగ్గర వాలంటీర్లను నియమించుకోవాలన్నారు. విజయబేతాళ ఊరేగింపు ఇతర ప్రాంతవాసులకు ఆదర్శం కావాలని డీఎస్పీ కోరారు. అంబాజీపేట కూడలిలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్సై చిరంజీవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ శీలం మోహనరావు, శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి వెంకటరామారావు, మట్టపర్తి రాము, సొసైటీ మాజీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, నిర్వాహకులు సాయికృష్ణ, సోమేశ్వరరావు, రమేష్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొంతు పెదబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపేట డీఎస్పీ గోవిందరావు

దుష్ట సంహారిణి.. దుర్గా రూపిణి

న్యూస్‌టుడే, బృందం: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. అయినవిల్లి దూనోయినవారిపాలెం అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ★ గొల్లపాలెంలో అమ్మవారికి కుంకుమ పూజలు జరిపించారు. ★ మగటపల్లి గాయత్రి త్రిశక్తి పీఠంలో అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించారు. మహిళలు సామూహికంగా లక్ష కుంకుమార్చనలు చేశారు. పాశర్లపూడి ఆలయంలో శత చండీ యాగం జరిగింది. ★ కొత్తపేట మండలం అవిడి గ్రామంలో వెంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి 200 మంది జంటలుగా కుంకమ పూజలు నిర్వహించారు. ★ అంబాజీపేట వాసవిమాత రాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.



రావులపాలెం గ్రామీణంలో...



ములికిపల్లి దుర్గమ్మ..



అయినవిల్లిలో..



అంబాజీపేటలో...



చింతలూరులో...



ఆత్రేయపురంలో...



గుడిమెళ్లంకలో...



అవిడిలో..



అంతర్వేది దేవస్థానంలో..



తాటికాయలవారిపాలెంలో..



మగటపల్లిలో కుంకుమార్చనలో మహిళలు..



గాయత్రి త్రిశక్తి పీఠంలో కొలువుదీరిన అమ్మవార్లు

తాగునీటి సమస్య పరిష్కరిస్తా

సఖినేటిపల్లి: రామేశ్వరం తాగునీటి ప్రాజెక్టు పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో రామేశ్వరం, సఖినేటిపల్లిలంక, గొంది, గుడిమూల, సఖినేటిపల్లి గ్రామాలకు నీరు సరఫరా అవుతుంది. పైపులైన్లు చిన్నవిగా ఉండటంతో తాగునీరు సక్రమంగా రావడంలేదని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో ఆయన పైపులైన్లు, చెరువును పరిశీలించారు. దిగువ ప్రాంతాలకు వేగంగా వెళ్లడానికి తగిన సామర్థ్యం కలిగిన పైపులైన్లు వేసి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న కనకదుర్గ ఆలయాల్లో పూజల్లో పాల్గొన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు ఫణికుమార్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



సమస్యపై ప్రజలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

గ్రామీణ ప్రజలకు సేవలు

పి.గన్నవరం: గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ భవనాల ద్వారా మరిన్ని సేవలు అందించవచ్చని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం గ్రామసచివాలయ భవనాన్ని గురువారం ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. సర్పంచి బొండాడ నాగమణి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మీ, నాయకులు నామన రాంబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, బాలవిజయరావు, శ్రీనుబాబు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గిడ్డి

అతివల ఆనందోత్సాహం

– న్యూస్‌టుడే, అంబాజీపేట

దేవీశరన్నవరాత్రులు సందర్భంగా అంబాజీపేట వాసవీమాత ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వేదికగా మారింది. ఇక్కడి ఆర్యవైశ్య మహిళలు, యువతులు, చిన్నారులు ఏర్పాటు చేస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ఇక్కడ మహిళలంతా చేసి కలిసికట్టుగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సందడిగా గడుపుతున్నారు. వీరిలో వైద్యులు, వివిధ ఉద్యోగాలు చేస్తున్న మహిళలూ ఉండటం విశేషం.

దసరా.. సరదా..

వైశ్యాస్‌లేడిస్ అసోసియేషన్ ప్రతినిధుల నేతృత్వంలో సౌందర్యలహరి పారాయణం, కోలాటం, చిన్నపిల్లల నృత్యాలు, గాజులు, అమ్మవారి ముఖారవిందం, సిగ ముడి, గణపతి తదితర అలంకరణలు చేస్తున్నారు. కోలాటం చేస్తున్నారు. ఆయా విభాగాల్లో పోటీల నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తున్నారు. 22 మంది మహిళలు రాజస్థాన్ ధాండీయా, కోలాటం ఆడుతున్నారు. ప్రతి రోజు 12 మంది మహిళలు వాసవిమాతకు క్రమం తప్పకుండా మంగళహారతిని ఇస్తున్నారు. ఏటా దసరా కోసం ఎదురు చూస్తామని, అమ్మవారి ఆలయ సన్నిధిలో వివిధ కార్యక్రమాల్లో తమ ప్రతిభను చూపి బహుమతులు అందుకోవడం ఆనందంగా ఉంటుందని కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలు అంటున్నారు.



కోలాటంలో సందడిగా మహిళలు

ఆకాశంలో రంగుల హరివిల్లులు

మెరుపు మెరిస్తే.. . ఆకసమున హరివిల్లు విరిస్తే.. ఆ ప్రకృతి సోయగాన్ని చూడటానికి రెండు కళ్లు సరిపోవన్నది నిజం. అలాంటిది ఒకేసారి రెండు హరివిల్లులు కనువిందు చేస్తే.. గురువారం ఉదయం పెదపళ్లలో ఒకేసారి రెండు ఇంద్రధనుస్సులు విరిసి మురిపించాయి. ఆ సోయగాన్ని ఫోన్లలో బంధించడానికి అంతా ఉత్సాహం కనపరిచారు. - న్యూస్‌టుడే, ఆలమూరు



రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు

రాజోలు, మలికిపురం, న్యూస్‌టుడే: వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతికి రాజోలు కూటమి నాయకులు గురువారం సంతాపం వ్యక్తం చేశారు. కూడలిలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా మాట్లాడుతూ రతన్ టాటా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతి దేశానికి తీరనిలోటని పేర్కొన్నారు. అడబాల విజయ్, కోళ్ల బాబి, కాట్న రాజు, దారపురెడ్డి బాబ్జీ, జొన్నలగడ్డ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ★ విశ్వేశ్వరాయపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంతాప కార్యక్రమంలో రతన్‌టాటా చిత్రపటం వద్ద ఎమ్మెల్యే, కూటమి నాయకులు నివాళులర్పించారు. దేశాభివృద్ధిలో పారిశ్రామికంగా టాటా కుటుంబం కీలకంగా ఉందన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, తాతాజి, నాని, నాయుడు పాల్గొన్నారు.

అంబాజీపేట: వ్యాపార దిగ్గజం రతన్ టాటా జీవితంలో సేవాగుణంతోనే ముందుకు సాగారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సరోవర్ అన్నారు. స్థానిక మండల పరిషత్తుకార్యాలయంలో టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ పాల్గొన్నారు.



విశ్వేశ్వరాయపురంలో...



రాజోలులో కూటమి నాయకుల నివాళి

మూత లేక.. నీరు కలుషితం..!

పాశర్లపూడి సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టు నుంచి మామిడికుదురు వైపు తాగు నీటిని సరఫరా చేసే గ్రావిటీ పైపు లైనుకు మధ్యలో ఉన్న ఎయిర్‌వాల్వుపై మూత విరిగిపోయింది. దీంతో అందులో వ్యర్థాలు చేరి నీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందులో కొందరు సామగ్రి కడుగుతుండడం, వర్షం నీరు చేరడంతో మరింత దుర్భరంగా మారుతోంది. దీనిని వెంటనే చక్కదిద్దాలని కోరుతున్నారు. ఎయిర్‌వాల్వుపై మూతను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సంబంధిత ఏఈఈ జయశ్రీ తెలిపారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు



పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ వహించాలి

మలికిపురం: చింతలమోరి గ్రామంలో సర్పంచి డా.రాపాక రమేశ్‌బాబు ఆధ్వర్యంలో మన గ్రామం-మన బాధ్యత అన్న నినాదంతో గ్రామాన్ని పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో, కాలువ గట్లు, రోడ్ల పక్కన తుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. తొలుత పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలని, వారానికి ఒక సారి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని జరపాలని తీర్మానించారు. జనసేన, తెదేపా గ్రామ శాఖల అధ్యక్షులు ఓగూరి మనోహర్, చెవ్వాకుల వెంకటరత్నం, కూటమి నాయకులు రాపాక శేఖర్, మైనం తాతయ్య, కొల్లు అంజిబాబు, కొల్లు శ్రీనివాసరావు, రాజు, మల్లాడి కనకయ్య, కర్రి సత్యనారాయణ, జగతాని వెంకటేశ్వర్లు, వాతాడి లోకేశ్ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో సర్పంచి, సిబ్బంది తదితరులు

నాడు అధోగతి.. కావాలి పర్యాటక ప్రగతి..

– న్యూస్‌టుడే, మామిడికుదురు

పరవళ్లు తొక్కే వైనతేయ నదీ తీరంలోని అందాలను నిత్యనూతనంగా ఆస్వాదించేందుకుగాను పర్యాటకుల కోసం నిర్మించిన బోటింగ్ టెర్మినల్స్ వెలవెలబోతున్నాయి. గత వైకాపా సర్కారు వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో అభివృద్ధి సంగతి ఎలా ఉన్నా. . తీరంలో అవి నిస్తేజంగా మారడంతో పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మామిడికుదురు మండలం ఆదుర్రులోని ఆది బౌద్ధ స్థూపానికి సమీపంలో 2017లో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన బోటింగ్ టెర్మినల్ మూతపడింది. ఇక్కడ నదీ జలాల్లోకి దాదాపు 70 మీటర్ల మేర సరదాగా వెళ్లి పరీవాహక అందాలను వీక్షించేందుకుగాను నిర్మించిన చెక్కల వంతెనకు మరమ్మతులు లేకపోవడంతో పూర్తిగా శిథిలమై కమ్మీలు చాలా వరకు కొట్టుకుపోయాయి. విహార కేంద్రం చుట్టూ పచ్చదనం హరించుకుపోయింది. బౌద్ధ స్థూపం వరకు ఏటిగట్టుపై 200 మీటర్ల మేర వేసిన సిమెంటు కాంక్రీటు రహదారి నెర్రెలు తీసింది. అక్కడి నుంచి స్థూపం ద్వారం వద్దకు దిగేందుకు అప్రోచ్ కరువైంది. పాశర్లపూడిబాడవలో వారధిని ఆనుకుని ఉన్న బోటింగ్ టెర్మినల్ ఓఅండ్ఎం విధానంలో ఉన్నా ఇక్కడ విశ్రాంతి తీసుకునేందుకు పర్యాటకులు ఎవరూ రావడం లేదు. టెర్మినల్ పైకప్పు పెంకులు ఛిద్రమవుతున్నాయి. 216 జాతీయ రహదారి నుంచి టెర్మినల్‌కు వెళ్లే మార్గానికి ఇరువైపులా మొక్కలు నాటడం, విద్యుద్దీకరణ పనులు చేపట్టకపోవడంతో వెలవెలబోతోంది. ఇక్కడ అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూర్చి పూర్తి సొబగులతో తీర్చిదిద్ది ఉపయోగంలోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.



ఆదుర్రు నదీ తీరంలో ఛిద్రమైన చెక్కల వంతెన



వెలవెలబోతున్న బోటింగ్ టెర్మినల్..

ప్రతిపాదనలు చేసి పంపించాం..

ఆదుర్రు, పాశర్లపూడి, దిండి పర్యాటక ప్రదేశాల్లో అవసరమైన గృహ పడవలు, స్పీడ్, పాంటూన్ బోట్లు, ఇతర సౌకర్యాలకుగాను సుమారు రూ.5 కోట్లు వ్యయమయ్యే ప్రతిపాదనలు చేసి ఆమోదానికి పంపించాం. నిధులు మంజూరైన వెంటనే అక్కడ పర్యాటకులకు సర్వం సిద్ధమవుతాయి. ఆదుర్రు వద్ద చెక్కల వంతెనను పరిశీలించి అవసరమైన కార్యాచరణ చేస్తాం. పర్యాటకులకు పూర్తి ఆహ్లాదం కలిగించేలా వాటిని తీర్చిదిద్దుతాం.

– పవన్‌కుమార్, పర్యాటక శాఖ డీవీఎం

చేపలకట్లు.. మురుగు పారక ఇక్కట్లు



శంకరగుప్తం మేజరు డ్రెయినులో విస్తరించిన చేపలకట్లు మురుగు నీటి పారుదలకు అడ్డం పడుతున్నాయి. దీంతో శంకరగుప్తం ప్రధాన మురుగు కాలువ పూడిక ఏర్పడి, చాలా చోట్ల కుచించుకుపోయి నీటి పారుదల సక్రమంగా సాగడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చింతలమోరి నుంచి శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి వరకు డ్రెయినులో పలు చోట్ల ఈ చేపలకట్లు ఉన్నాయి. వెదురు కర్రలు, తడికలతో తయారైన చేపల కట్లు బలంగా ఉండడం వల్ల నీటి ప్రవాహం సక్రమంగా పారడం లేదు. సంవత్సరాలుగా ఈ చేపలకట్లు తొలగించాలని రైతులు సంబంధిత అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకుండా ఉందని అంటున్నారు. డ్రెయినులో మురుగు నీరు లాగక వర్షాల్లో వరి చేలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినులో చేపల కట్ల సమస్యపై జలనరుల శాఖ(డ్రెయిన్సు విభాగం) డీఈఈ నాగార్జునను వివరణ కోరగా ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం



నివాళి అర్పిస్తున్న అసోషియేషన్ ప్రతినిధులు

రతన్ టాటాకు నివాళి


అమలాపురం పట్టణం:, న్యూస్‌టుడే: రతన్ టాటా మృతికి అమలాపురంలోని గడియారస్తంభం కూడలిలో ది అసోషియేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు నివాళి అర్పించారు. సంఘ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

డీపీవోను కలిసిన సర్పంచులు



అమలాపురం గ్రామీణం: జిల్లా పంచాయతీ అధికారిణిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శాంతలక్ష్మిని అమలాపురం మండల సర్పంచుల సమాఖ్య ఆధ్వర్యంలో పలువురు సర్పంచులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సర్పంచులు నక్కా అరుణకుమారి, దాసరి అరుణ, రేలంగి దుర్గారావు, నాయకులు నక్కా చంద్రశేఖర్, కరాటం ప్రవీణ్, చొల్లంగి అప్పాజీ, దాసరి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రనివాళి



బన్నీ గీసిన రతన్‌టాటా చిత్రం

కాట్రేనికోన: ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్‌టాటా మృతి చెందడంతో బలుసుతిప్పకు చెందిన యువ చిత్రకారుడు సంగాని బన్ని ఆయన చిత్రం గీసి నివాళి అర్పించారు.

అమలాపురం గ్రామీణం: పాలగుమ్మికి చెందిన చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ చిత్రం గీసి రతన్ టాటాకు నివాళి అర్పించారు. కలర్ పెన్సిల్, వాటర్ కలర్స్ ఉపయోగించి చిత్రం వేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

పూడిక తీశారు..

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బళ్లగేటు సెంటర్‌లో కాలువ పూడిపోవడంతో మురుగు దిగువకు దిగక దుర్వాసన కొడుతోంది. అధికారులు స్పందించి డ్రెయిన్‌లో పూడిక తొలగించి సమస్యను పరిష్కరించాలి. - పి.సత్యనారాయణ, స్థానికుడు

పరిష్కారం: డ్రెయిన్‌లో పూడిక సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించి సమస్యను పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, ముమ్మిడివరం**

పైపులైనుకు మరమ్మతులు

సమస్య: కాట్రేనికోనలో కొళాయి పైపులైను పగిలి నీరు లీకవుతుంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. **-స్థానికులు**

పరిష్కారం: సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. తమ సిబ్బందితో పైపులైను మరమ్మతులు చేయించారు.

వీధిదీపాలు వెలిగె..

సమస్య: దొంతికుర్రు పంచాయతీ పండి తూము పరిసరాలను ఆనుకుని కొన్ని వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. **-గ్రామస్థులు**

పరిష్కారం: ఈ సమస్యను సర్పంచి ఈశ్వరికి తెలుపగా స్పందించారు. సిబ్బందితో గ్రామంలో వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు. **-న్యూస్‌టుడే, కాట్రేనికోన**

సమస్య: అమలాపురంలోని కంకిపాటివారి వీధిలోని మురుగుకాలువలో పూడికలు తొలగించక ఇబ్బందులు పడుతున్నాం. **- బషీర్, వ్యాపారి.**

సమస్య: కాలేజీరోడ్డులో చెత్తను తొలగించడం లేదు. **- యినుమల రాజేష్, స్థానికుడు**

సమస్య: గొల్లగూడెం రోడ్డు మురుగుకాలువలో వ్యర్థాలను పడేయడంతో మురుగు ముందుకు కదలడంలేదు. **- రమేష్**

సమస్య: అమలాపురం అశోక్‌నగర్ రోడ్డు పక్కన చుట్టుపక్కల వారు చెత్తను పడేస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలి. **- శ్యామ్‌బాబు, వ్యాపారి**

పరిష్కారం: ఈ సమస్యలను ఆయా వార్డు సచివాలయ కార్యదర్శుల దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. **-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం**

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166



దుర్గాదేవి రూపంలో అమలాపురంలోని శ్రీదేవి అమ్మవారు, వాసవీ కన్యకాపరమేశ్వరి, వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీవైష్ణవి కనకదుర్గ, భవానినగర్ కల్యాణదుర్గ, వేపచెట్టు శ్రీకనకదుర్గ, శ్రీకామాక్షి ఏకాంబరీశ్వరి, కాలేజీరోడ్డులో బాలా త్రిపుర సుందరి దేవి

అభయ ప్రదాత.. దుర్గామాత

శరన్నవరాత్రి ఉత్సవాల్లో గురువారం అమ్మవార్లు దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చారు. పట్టణంలోని సుబ్బాలమ్మ అమ్మవారిని పసుపుకొమ్ములతో అలంకరించారు. శనివారం వరకు అమ్మవారు అలంకరణలో ఉంటారని నిర్వాహకులు తెలిపారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ వేపచెట్టు శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయనకు జనసేన కౌన్సిలర్ ఏడిద శ్రీను, ఆర్డీఎస్ ప్రసాద్ స్వాగతం పలికారు. నారాయణపేట ప్రభాకర్‌నగర్‌లో విజయదుర్గ అమ్మవారి ఆలయంలో తెదేపా, జనసేన పార్టీ, వైకాపా నాయకులు పూజలు నిర్వహించారు. మెట్ల రమణ బాబు, కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. భవానీ భక్తులు చండీ హోమం, కుంకుమపూజలు నిర్వహించారు.



సన్నవిల్లి కనకదుర్గమ్మ



కుండలేశ్వరంలో..



చినకొత్తలంకలో దుర్గామాతగా..



లక్ష పసుపుకొమ్ములతో మురమళ్ల వీరేశ్వరస్వామి



లక్ష పసుపు కొమ్ములలో అభిషేకం



యానాంలో..



కల్వకొలను వీధి కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే దేవవరప్రసాద్

భద్రకాళీ అమ్మవారికి లక్ష పసుపు కొమ్ముల పూజ

- మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో గురువారం భద్రకాళీ అమ్మవారికి లక్ష పసుపు కొమ్ముల పూజ నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పసుపు కొమ్ములతో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. **- న్యూస్‌టుడే బృందం**

ఉత్తమ సర్పంచికి సన్మానం

కాట్రేనికోన, న్యూస్‌టుడే: మండల ఉత్తమ సర్పంచిగా ఇటీవల అవార్డు పొందిన గెద్దనపల్లి సర్పంచి దంతులూరి సీతారామకృష్ణంరాజును గురువారం గ్రామ సచివాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. ఎస్సై అవినాష్, దాట్ల పవన్, ఆకాశం శ్రీను, ముదునూరు రంగరాజు, గంటి సుధాకర్, చెల్లి సురేష్, లక్ష్మీరమణారావు, గోడి వెంకట్రావు, ఎంటీవీ వర్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరసన విరమణ



స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ, ఓఎన్‌జీసీ అధికారులు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: ఉప్పూడిలో ఓఎన్‌జీసీ పాత బావి ఉన్న స్థలానికి లీజులు చెల్లించాలని, గతంలో హామీ ఇచ్చిన నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ గ్రామస్థులు చేపట్టిన ధర్నా గురువారం విరమించారు. రెండోరోజు ధర్నాను కొనసాగిస్తుండగా ఓఎన్‌జీసీ అధికారులు అక్కడికి చేరుకుని బావిని గతంలోనే ప్రైవేటు సంస్థకు అప్పగించామని వారే లీజు చెల్లించాలని పేర్కొన్నారు. లీజు, నష్టపరిహారం ఇవ్వాల్సిందేని రైతులు రోడ్డుపై బైఠాయించారు. ప్రధాన రోడ్డుపై ఓఎన్‌జీసీ వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, అధికారులు వారితో మాట్లాడారు. ఈ సమస్యను ఎంపీ ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో ధర్నాను విరమించారు.

మత్స్యకారులకు పరికరాల అందజేత



లబ్ధిదారుకు పరికరం అందిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: బైరవపాలెంలోని లబ్ధిదారులకు మంజూరైన ట్రాన్స్ పాండర్స్‌ను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు గురువారం మురమళ్లలో అందజేశారు. బోట్లుకు ఉపయుక్తంగా ఉండే వీటికి రూ.60 శాతం కేంద్రం, 40శాతం రాష్ట్రం రాయితీ అందజేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. రూ.24.12 లక్షలు విలువ చేసే ఈ ట్రాన్స్ పాండర్స్‌ను 64 బోట్లకు అమర్చనున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి గోపాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.ధర్మారావు, రాజు, రేఖాడి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదార్ల నిర్మాణానికి రూ.13.43 కోట్లు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నియోజకవర్గంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులు రూ.13.43 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. ముమ్మిడివరం మండలంలోని 15 గ్రామాల్లో రూ.2.91 కోట్లు, కాట్రేనికోన మండలంలో 11 గ్రామాల్లోని 48 ప్రాంతాల్లో రూ.2.82 కోట్లు, ఐ.పోలవరం మండలంలోని 14 గ్రామాల్లో 46 ప్రాంతాల్లో రూ.4.26 కోట్లు, తాళ్లరేవు మండలంలో 11 గ్రామాల్లోని 67 ప్రాంతాల్లో రూ.3.43 కోట్లుతో రహదార్లు నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ నెల 14 నుంచి పల్లె పండగ కార్యక్రమంలో వీటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని పేర్కొన్నారు.

అగ్రహారాల్లో అవస్థలు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

అమలాపురం పట్టణంలోని కె.అగ్రహారం, వడ్డిగూడెం, భూపయ్యఅగ్రహారంలో ప్రజలు రహదారులు, మంచినీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. మురుగు కాలువలలో పూడికలు పూర్తిగా తొలగించడం లేదు. కుక్కలు, పశువులు రహదారులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వీటితో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీధి దీపాలు పగలు వెలిగి రాత్రి పూట పనిచేయడం లేదు. వీధుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి.



ట్యాప్ లేని కుళాయి

తరచూ ట్రాఫిక్ సమస్యలు

ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా ఉన్న అంతర్గత రహదారిలో ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి. ఇక్కడ అధిక సంఖ్యలో పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, వాణిజ్య దుకాణ సముదాయాలు ఉన్నాయి. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఎక్కువగా ఈ రహదారిని వినియోగిస్తారు. రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. కల్యాణ మండపాలలో వేడుకలు జరిగితే స్థానికుల బాధ వర్ణనాతీతం. భూపయ్యఅగ్రహారం రోడ్డు గుంతలమయంగా మారింది. దీనిని బాగుచేసి అందుబాటులోకి తీసుకువస్తే ట్రాఫిక్ సమస్యలు తగ్గే వీలుంది.



భూపయ్యఅగ్రహారం రోడ్డు పరిస్థితి

బురదనీరే గతి

తాగునీరు సరిగా సరఫరా కావడం లేదు. ట్యాప్‌లు లేకపోవడంతో నీరు వృథా అవుతోంది. అప్పుడప్పుడు రంగుమారిన, బురద నీరు వస్తోందని జనం వాపోతున్నారు. కలుషిత నీరు తాగడం వల్ల అనారోగ్యం బారినపడుతున్నారు.

త్వరలో మరమ్మతులు చేయిస్తాం..

మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపితే భూపయ్య అగ్రహారంలో రూ. కోటితో రహదారులను నిర్మిస్తాం. త్వరలో మంచినీటి సమస్య పరిష్కారం అవుతుంది. **-కె.వి.వి.ఆర్.రాజు, మున్సిపల్ కమిషనర్**

ఐ.పోలవరం ఎస్సైగా మల్లికార్జునరెడ్డి



ఐ.పోలవరం: ఐ.పోలవరం ఎస్సైగా ఆర్.మల్లికార్జున రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు నుంచి ఇక్కడకి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు.

వలకట్ల విషయంలో ఘర్షణ

కాట్రేనికోన, న్యూస్‌టుడే: వలకట్ల విషయంలో ఇరువర్గాల మధ్యరేగిన వివాదంలో పలువురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లంలో వలకట్లను నిర్వహించుకునే క్రమంలో రెండు వర్గాలకు చెందిన వ్యక్తుల మధ్య గురువారం వివాదం రేగింది. ఈ క్రమంలో పరస్పరం దూషించుకున్నారు. వివాదం పెరిగి దాడులు చేసుకున్నారు. కొందరు గాయపడటంతో చికిత్స నిమిత్తం ముమ్మిడివరం తరలించారు. ఇరువర్గాలు పరస్పర ఫిర్యాదు చేయడంతో చెరో ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై అవినాష్ తెలిపారు.

ఫార్మా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యానాం: యానాంలో ఫార్మా పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతన చట్టం, బోనస్ వంటి సౌకర్యాలను కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, యానాం సమన్వయకర్త కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. వీరి సమస్యలపై యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.

యానాం సబ్ రిజిస్ట్రార్‌గా నరేంద్రకుమార్

యానాం, న్యూస్‌టుడే: యానాం సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవసాయశాఖ ఉద్యోగి పి.నరేంద్రకుమార్‌ను నియమించారు. ఈ మేరకు పుదుచ్చేరి పాలనా సంస్కరణ విభాగం అధికారి జై శంకర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

మానసిక సంక్లిష్టతలను ముందే గుర్తించాలి



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రహంతుల్లా

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అకస్మాత్తుగా వచ్చే మార్పులు, మానసిక సంక్లిష్టతలను ముందుగానే గుర్తించి వైద్య సేవలు అందిస్తే వారిని పూర్వ స్థితికి తీసుకురావచ్చని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహంతుల్లా అన్నారు. 'ప్రపంచ మానసిక దినోత్సవం' సందర్భంగా ముమ్మిడివరంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద మండల లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు రహతుల్లా అధ్యక్షత వహించి మాట్లాడారు. హుషారు తగ్గడం, ఒంటరిగా ఉండడం, తరచూ పడుకునే ఉండటం, నిద్ర లేకపోవడం, ఆహారం తీసుకోవడం తగ్గించడం, కోపం పెరగడం, ఆత్మనూన్యత వంటి లక్షణాలు కనిపిస్తే వారితో ప్రేమగా మాట్లాడి సమస్యను తెలుసుకుని చికిత్స అందించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి సత్యనారాయణ, వైద్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాళ్లదారిలో నడకయాతన!



కాట్రేనికోన మండలం గచ్చకాయలపోర సముద్రతీరం నుంచి నీలరేవు వరకు ఉన్న రోడ్డు ఎక్కడికక్కడ గుంతలుపడి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. పదేళ్ల కిందట నిర్మించిన ఈ రోడ్డు మొత్తం ఛిద్రమయ్యి, కంకర రాళ్లు పైకి లేచాయి. దీంతో ఇటుగా గచ్చకాయలపోర, చిర్రయానం, నీలరేవు సముద్రతీరానికి వచ్చే పర్యాటకులు, సమీప గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నామంటున్నారు. కనీసం నడవడానికి కూడా వీలు లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు. సమస్యపై జేఈ ఫకీర్‌ను వివరణ కోరగా రూ.2.50 కోట్లతో రోడ్డుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మంజూరైన వెంటనే రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కాట్రేనికోన**

ఆయుధ పూజ

యానాం: యానాం మున్సిపాలిటీ శానిటరీ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో దసరా ఆయుధ పూజ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రాకమృష్ణ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఐసీయూ అందుబాటులో ఉండాలి

యానాం: యానాం ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న పలువురిని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు. ఐసీయూలో ఉంచాల్సిన వారిని జనరల్ వార్డులో ఉంచుతున్నారని పలువురు మల్లాడి దృష్టికి తీసుకు వెళ్లారు. మల్లాడి పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖరన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఐసీయూ వార్డు రోగులకు అందుబాటులో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మండపేట
•మండపేట •రామచంద్రపురం

కనులపండువగా పేటతుళ్లి


వెదురుపాకలో పేటతుళ్లి ఆడుతున్న అయ్యప్ప మాలధారులు

రాయవరం: మండలంలోని వెదురుపాక జనార్దన స్వామి ఆలయంలో అయ్యప్పమాలధారులు గురువారం పేటతుళ్లి నిర్వహించారు. గురుస్వామి బండారు వెంకట రమణస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, వామనావతార వేషధారణలు ఆకట్టుకున్నాయి. అయ్యప్పస్వామి భక్తిగీతాలు, వాయిద్యాలకు అనుగుణంగా అయ్యప్పమాలధారులు నృత్యాలు చేస్తూ పేటతుళ్లి ఆడారు.

ప్రధాన కాలువల ప్రక్షాళన


పొక్లెయిన్‌తో పూడిక తీత

మండపేట, న్యూస్‌టుడే: గత కొన్ని సంవత్సరాలుగా పూడుకు పోయి దోమలు పెరిగి బాధ పడుతున్న ప్రజలకు ఉపశమనం కలగనుంది. ఎట్టకేలకు పట్టణంలో పలు ప్రధాన కాలువల్లో సిల్టు తొలగించే కార్యక్రమాన్ని అధికారులు ముమ్మరం చేశారు. మున్సిపల్ కమిషనర్ రంగారావు ఆదేశాలపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తిరాజు పర్యవేక్షణలో పలు ప్రధాన కాలువల్లో పూడిక తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.

ఎట్టకేలకు చెత్త తొలగించారు

ఈనాడు కథనానికి స్పందన

మండపేట గ్రామీణం:మారేడుబాకలో ప్రజలు కొన్ని సమస్యలతో సతమతమవుతున్నారు. ఈనేపథ్యంలో 'ప్రధాన సమస్యకు పరిష్కారమెప్పుడు' అనే కథనం ఈనాడులో గురువారం ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, ఈఓపీఆర్డీ దాసరిశ్రీను, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్‌లు స్పందించారు. మారేడుబాక సెంటర్ జంక్షన్ నుంచి నేలటూరు వెళ్లే రహదారి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు రహదారి ప్రక్కన వేసిన చెత్తాచెదారాలను వేరేచోటికి తరలించారు. కాలువగట్టున చెత్త వేయకుండా చర్యలు చేపడతామని, ప్రజలకు అవగాహన కల్పిస్తామని వరప్రసాద్ తెలిపారు.


చెత్తను తరలిస్తున్న సిబ్బంది

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట వరకు

మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

సమస్య: ఇప్పనపాడు రిలయన్స్ కాలనీ నుంచి చినద్వారపూడి సత్తెమ్మ అమ్మవారి ఆలయం వరకు ఉన్న కాలువలో ఒక పరిశ్రమలో వ్యర్థాలు వదులుతున్నారు. ఇటుగా వెళ్లే వాహనదారులు ఈదుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి.
- కెపికుమార్, మండపేట.

సమాధానం: పరిస్థితిని పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం.
- సుబ్బారావు, కార్యదర్శి, ఇప్పనపాడు.


సమస్య: పాలతోడుకు వెళ్లే రహదారిలో సరిగా విద్యుత్తు దీపాలు వెలగటంలేదు. రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు చర్యలు చేట్టాలి.
- రామకృష్ణ.పాలతోడు

సమాధానం: విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం.
- వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, పాలతోడు

– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

యంత్ర సేద్యం.. రైతుకు భారం

రెట్టింపవుతున్న వ్యవసాయ పరికరాల ధరలు


సాగుకు వినియోగించే వ్యవసాయ యంత్ర పరికరాలు

పామర్రు, న్యూస్‌టుడే: సాగులో రైతులు వాడుతున్న యంత్ర పరికరాల ధరలు విపరీతంగా పెరిగాయి. అద్దెకు తెచ్చుకుందామనుకున్నా అందనంత ఎత్తులో ఉంటున్నాయి. అసలే అంతంత మాత్రంగా దిగుబడులు ఉంటున్న ఈ సమయంలో పరికరాల ధరలు కూడా గతేడాదితో పోలిస్తే 30 శాతం మేర పెరిగిపోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీనికి తోడు ఇనుము ధర కూడా పెరిగింది. కిందటేడాది టన్ను రూ.40-50వేల మధ్యన ఉంటే ఈ సారి అది రూ.70-75వేలకు పెరిగిపోయింది. దీంతో యంత్రపరికరాలు కొనుగోలు చేసే రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విడి భాగాలూ కొనడం గగనమే:

వ్యవసాయ సీజన్ ముమ్మరంగా నడుస్తోంది. రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో సుమారు 30,967 మంది రైతులు 1,07,170 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. వీరిలో సగం మంది పైగా కౌలు రైతులే. ప్రస్తుతం రైతులు సేద్యపు పనుల్లో 90 శాతం యంత్ర పరికరాలనే వాడుతున్నారు. సేద్యపు పరికరాలు, విడిభాగాలు, నట్లు, బోల్టులు, బేరింగులు, తదితర వాటి ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. యంత్రాలు తయారు చేసేందుకు వెల్డింగ్‌కు వాడే ఆక్సిజన్ సిలెండర్(10లీటర్లు) గతంలో రూ.5వేలు ఉంటే ఇపుడు రూ.6 వేలకు పెరిగింది. దీనికి తోడు డీజిల్ ధరలు పెరగడంతో యంత్ర పరికరాల రవాణా ఛార్జి కూడా తలకు మించిన భారంగా మారుతోంది.

రాయితీ తీసేసిన వైకాపా ప్రభుత్వం...

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతులకు రాయితీపై యంత్ర పరికరాలను అందించేవారు. ట్రాక్టర్లు, రోటోవేటర్, కల్టివేటర్, గొర్రు, తదితర పరికరాల కొనుగోలుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 95 శాతం, ఇతరులకు 50 శాతం రాయితీ ఇచ్చేది. వైకాపా అధికారంలోకి వచ్చాక రాయితీ మాట మర్చిపోయారు. రైతులకు పరికరాలు ఇస్తామని చెప్పడమే కానీ పూర్తిగా ఇవ్వడం లేదు. కస్టమ్ హియరింగ్ కేంద్రాలను, వాటికి రైతు సంఘాలను ఏర్పాటు చేశామని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎంతో మేలు చేస్తామని గొప్పలు చెప్పినా కూడా ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోలేదు. రైతు బృందాలకు డ్రోన్‌లు ఇస్తామన్నారు. ఆర్భాటంగా దరఖాస్తులు తీసుకున్నారు. నెలలు గడిచినా వాటిని కూడా అందించలేదు. కూటమి ప్రభుత్వం రాయితీతో వ్యవసాయ పరికరాలను అందించాలి. కొనుగోలు దారులకు వాటి ధర తగ్గిస్తే మేలు జరుగుతుంది.

కేంద్రాలకు ఇచ్చినవి అందుబాటులో ఉంచుతాం

కస్టమ్ హియరింగ్ కేంద్రాల సంఘాలకు ఇచ్చిన యంత్ర పరికరాలు రైతులందరికీ అందుబాటులో ఉంచుతున్నాం. ప్రతి రైతు దీనిని వినియోగించుకోవచ్చు. అవసరం అయిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదిస్తే సామాన్య అద్దె ప్రాతిపదికన యంత్రాలను అందిస్తారు. ప్రభుత్వం మారడంతో విధానాలు కూడా మరే అవకాశం ఉంది. **- బలుసు రవి, ఏవో, కె.గంగవరం**

మహోన్నత వ్యక్తి రతన్ టాటా

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రతన్ టాటా మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. భారతదేశం గర్వించ దగ్గ మహోన్నతమైన వ్యక్తి రతన్ టాటా అన్నారు. విలువలతో కూడిన వ్యాపారానికి చిరునామాగా నిలిచిన ఓ మహనీయుడన్నారు. వంట గదిలో వాడుకొనే ఉప్పు నుంచి విమానం దాకా ఆకాశమే హద్దుగా విస్తరించిన వాణిజ్య విశ్వరూపమన్నారు. టాటా గ్రూప్ వాటా నుంచి 60 నుంచి 65 శాతం స్వచ్ఛంద సంస్థలకి ఇచ్చిన గొప్ప సేవా మూర్తి అన్నారు. కారులో ప్రయాణించాలనే భారతీయ మధ్య తరగతి కుటుంబాల కలను నానో కారు ద్వారా నెరవేర్చిన దిగ్గజ పారిశ్రామిక వేత్త రతన్ టాటా అని ఆయన సేవలను మంత్రి కొనియాడారు.

అంగర: పద్మ విభూషణ్ రతన్ టాటా మృతి పారిశ్రామిక రంగానికే కాకుండా, దేశానికే తీరని లోటని మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. గురువారం ఆయన కపిలేశ్వరపురం మండలం వల్లూరులో మాట్లాడుతూ భారతీయ ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

ఆశా వర్కర్లపై వేధింపులు తగదు

కాజులూరు: కాజులూరు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శలపాక సబ్‌సెంటర్‌లో పనిచేస్తున్న ఏఎన్ఎం పంపన రామకృష్ణవేణి అదే గ్రామానికి చెందిన ఆశ వర్కర్ అనంతలక్ష్మి, విజయలక్ష్మిలపై వేధింపులకు గురిచేస్తూ అసభ్యకర పదజాలంతో వేధిస్తున్నట్లు జిల్లా ఆశవర్కర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరి, చంద్రమల్ల పద్మ పేర్కొన్నారు. గురువారం ఆరోగ్యకేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా ఆశ వర్కర్లకు జీతాల బిల్లు పెట్టకుండా వేధిస్తుందన్నారు. ఈ ఆందోళనలో లంక దుర్గాదేవి, పి.వెంకటలక్ష్మి, దుర్గాదేవి, కే.విజయసురేఖ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

చెబితేనే.. కాలువలు శుభ్రం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణంలో ఆయా వార్డుల్లో మురుగు కాలువల్లో ఉన్న సిల్టును కనీసం 15 రోజులకు ఒక్కసారైనా తీయడం లేదని పట్టణంలో ఆయా వార్డుల్లో ప్రజలు వాపోతున్నారు. ఒకటికి రెండు సార్లు ప్రజలు చెబితేనే కొన్ని వార్డుల్లో కాలువలు శుభ్రం చేస్తున్నారని మరి కొన్ని వార్డుల్లో మొత్తుకున్నా కాలువలను సకాలంలో శుభ్రం చేయలేకపోతున్నారని పలువురు వాపోతున్నారు. పట్టణ 23వ వార్డు పరిధి నాయుడువారి వీధి తదితర ప్రాంతాల్లో నెల రోజులుగా కాలువను శుభ్రం చేయాలని ఎన్నిసార్లు పురపాలక సిబ్బందికి చెప్పినా శుభ్రం చేయలేదని ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వీధి ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆయా వార్డుల్లో కనీసం వారానికి రెండు పర్యాయాలైనా కాలువ శుభ్రం చేయించగల్గితే పట్టణ ప్రజలకు జ్వరాలు దూరమవుతాయని పలువురు వేడుకుంటున్నారు. దీనిపై శానిటరీ తనిఖీదారు డేవిడ్‌రాజును వివరణ కోరగా వారానికి రెండు పర్యాయాలు ఆయా వీధుల్లో కాలువలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది కొరత వల్ల కొన్ని ఇబ్బందులు ఉండటం వాస్తవమేనని చెప్పుకొచ్చారు.



భాజపాతోనే దేశ భవిష్యత్తు

మండపేట: ప్రధాని మోదీ నాయకత్వంలో భాజపా ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు అని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణ రాజు పేర్కొన్నారు. గురువారం మండపేటలో భాజపా సభ్యత్వాల నమోదుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లో సభ్యత్వం నమోదు ఆశాజనకంగా ఉందన్నారు. అన్ని రాష్ట్రాల్లో భాజపా బలపడితే పేద ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ సాయిరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, చట్రాతి జానకి రాంబాబు, మండల అధ్యక్షుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వేటుకూరి సూర్యనారాయణరాజు

మున్సిపల్ దుకాణాల వేలం.. ఆసక్తి చూపని వ్యాపారులు

మండపేట, న్యూస్‌టుడే: మండపేట మున్సిపాలిటి దుకాణాలకు గురువారం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో నిర్వహించిన లీజు వేలంలో 35 దుకాణాలకు లీజు వేలం నిర్వహించగా కేవలం 5 దుకాణాలు మాత్రమే పాడుకుని వ్యాపారులు నిరాసక్తత కనబరుస్తున్నారు. వేలం దుకాణాల్లో పాతమార్కెట్ వద్ద, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా, బురుగుంట చెరువు సమీపంలో ఖాళీగా ఉన్న దుకాణాల లీజుకు వేలం నిర్వహించారు. పాడుకున్న వారిలో అతి తక్కువగా మొదటి అంతస్తులో రూ.4,200, అత్యధికంగా రూ.24,500కి పాడుకున్నారు. వీటిలో మొదటి అంతస్తులో మూడు దుకాణాలు, కింద అంతస్తులో రెండు దుకాణాలు ఉన్నాయి. ప్రసుతం వేలం నిర్వహించిన దుకాణాలు ఏడాదిగా ఖాళీగా ఉండడంతో పలు దఫాలు వేలం నిర్వహించినా వ్యాపారులు ముందుకు రాకపోవడం గమనార్హం. లీజుగడువు ముగిసిన కొన్ని దుకాణాలకు గతంలో అద్దె ఎక్కువ ఉందన్న ఉద్దేశ్యంతో కౌన్సిల్ తీర్మానం చేసి అద్దె తగ్గించి మళ్లీ పాట నిర్వహించడంతో వ్యాపారులు దక్కించుకున్నారు. తాజాగా నిర్వహించిన దుకాణాల అద్దె ఎక్కువ ఉందన్న ఉద్దేశంతో ముందుకు రాలేదు. ప్రస్తుతం మిగిలిపోయిన 30 దుకాణాలకు కౌన్సిల్ తీర్మానం చేసి మళ్లీ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ రంగారావు తెలిపారు. రెవెన్యూ అధికారి, జెవిఎస్ శాస్త్రి, సువర్ణ, ఇతర రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


దుకాణాలకు వేలం నిర్వహిస్తున్న అధికారులు


ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో ఆవిష్కరిస్తున్న గ్రంథం

శ్రీపాదుకా భీమనాథమ్ గ్రంథ ఆవిష్కరణ

ద్రాక్షారామ: ద్రాక్షారామ భీమేశ్వరాలయ అతిథి గృహంలో గురువారం కాశీనివాసి కీల్లూరి అవతారశర్మ రచించిన ద్రాక్షారామ క్షేత్ర స్థల పురాణం 'శ్రీపాదుకాభీమనాథమ్' గ్రంథాన్ని ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవతారశర్మ మాట్లాడుతూ వారణాసి కన్నా దక్షిణకాశీ ద్రాక్షారామ పందింతలు గొప్పదని, అయినా అంధ్రుల అలసత్వం వల్ల ఈ క్షేత్రం మహత్యానికి తగినట్టుగా అభివృద్ధి చెందలేదన్నారు.

దుర్గాదేవి.. అనుగ్రహించు తల్లీ..


రామచంద్రపురం కొత్తూరు రోడ్డులో


రామచంద్రపురం పార్కువద్ద..

రామచంద్రపురం, న్యూస్‌టుడే: దేవి నవ రాత్రి మహోత్సవాలు ఊరూరా వైభవంగా జరుగుతున్నాయి. రామచంద్రపురం పట్టణంలో కొత్తూరు రోడ్డులో, శీలంవారి సావరం రోడ్డులోను, శివాలయం పార్కువద్ద, జ్ఞాన సరస్వతి అమ్మవారిని ప్రత్యేకంగా దుర్గాదేవిగా అలంకరించారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరించారు. ఉదయం మేలుకొలుపు, సుప్రభాత సేవ, అర్చనలు జరిగాయి. ఆదివారపుపేట శ్రీ శివబాలయోగి ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరించారు. సాక్షివారి వీధి ముత్యాలమ్మ ఆలయంలో, వెలంపాలెం గోగులాంబ అమ్మవారి ఆలయంలో, ద్రాక్షారామ కన్యకాపరమేశ్వరి అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

ద్వారపూడి, మండపేట గ్రామీణం: మండపేట మండలం ద్వారపూడిలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తాపేశ్వరం, అర్తమూరు, ఇప్పనపాడు, పాలతోడు, వెలగతోడు గ్రామాల్లోని కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో కుంకుమార్చనలు చేశారు.

అంగర: కపిలేశ్వరపురం దుర్గాపీఠంలో పీఠాధిపతి భాస్కర స్వామీజీ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. అంగర పల్లపువీధిలోని విజయదుర్గ మండపం వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

మండపేట: పట్టణంలోని రావులపేటలో దీక్ష చేపట్టిన భవాని భక్తులు జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. నాయుళ్లరామాలయం వద్ద ఏర్పాటుచేసిన అమ్మవారి మండపం వద్ద భవాని భక్తులు సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. కలువపువ్వు సెంటరులో కనకదుర్గ ఆలయం వద్ద హోమాలు నిర్వహించారు.


జ్యోతులతో భవాని భక్తుల ఊరేగింపు


శీలంవారి సావరం రోడ్డులో..


రామచంద్రపురం జ్ఞాన సరస్వతి


ఆదివారపుపేట బాలయోగి ఆశ్రమంలో..


ద్వారపూడిలో..


దుర్గాదేవి అవతారంలో శ్రీరాజ్యలక్ష్మీ


అంగరలో..


మండపేటలో..


వెదురుపాకలో..

ఉత్సవంలో అశ్లీల నృత్యాలు వద్దు: డీఎస్పీ

అంబాజీపేట: అంబాజీపేటలో ఈ నెల 16న పెద్ద ఎత్తున నిర్వహించే విజయ బేతాళస్వామి వారి వాహనమహోత్సవంలో ఎలాంటి అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేయవద్దని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు అన్నారు. ఈ వాహనమహోత్సవాన్ని పండుగ వాతావరణంలోనే నిర్వహించుకోవాలన్నారు. గురువారం అంబాజీపేటలోని కల్యాణ మండపంలో 13 శెట్టిబలిజపాలేంలకు చెందిన వాహనాల నిర్వాహకులతో సీఐ రుద్రరాజు భీమరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. డీఎస్పీ మాట్లాడుతూ.. వాహనాలకు సినిమా హీరోలు, రాజకీయ ప్రముఖుల ఫ్లెక్సీలను పెట్టవద్దన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

కాజులూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. పెనుమళ్ల గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ ఎస్.ఇందిర ఇల్లు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో ఆమె కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. రూ.10 వేలు నగదు అందజేశారు. రెవెన్యూ అధికారులు రూ.5 వేలు, 25 కిలోల బియ్యం అందజేశారు. డేగల వెంకట సతీష్ నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

ప్లాస్టిక్ నిషేధం అమలయ్యేనా..

మండపేట, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ నిషేధం...ఈ పదం వ్యాపారులకు, వినియోగదారులకు కొత్తకాదు. గత దశాబ్దంన్నర కాలంగా అనేక పర్యాయాలు ప్లాస్టిక్ పై యుద్ధం ప్రకటించినా పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయారు. మండపేటలో ప్లాస్టిక్‌నిషేధం విధించడం కొత్త కాకపోయినా అధికారులు తీసుకునే కఠిన చర్యల కారణంగా కొంత వరకు నిలువరించే పరిస్థితులు ఉన్నాయి. గతంలో దుకాణాలపై ముమ్మరంగా దాడులు నిర్వహించి అధిక మొత్తంలో జరిమానా విధించేవారు. మైకుల్లో తీవ్రంగా హెచ్చరికలు జారీ చేస్తూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించేవారు. అదేవిధంగా ప్లాస్టిక్ కవర్లతో వెళ్లే వినియగదారులకు కూడా రూ.50 జరిమానా విధించడంతో కొంత వరకు సఫలీకృతమయ్యారు. తరువాత కొంత కాలానికి రాజకీయ ప్రమేయం లేదా అధికారుల ఉదాసీనత కారణంగా ప్రజలు లైట్ తీసుకుని మరలా యదేశ్చగా వినియోగిస్తున్నారు.


డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన వ్యర్థాలు


కర్రీపాయింట్‌లో ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలు

మండపేటలో ఇలా..

జనాభా	: 64వేలు,
వార్డులు	: 30
ప్రతి రోజు విడుదలయ్యే వ్యర్థాలు	: 28 మెట్రిక్ టన్నులు
అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు	: సుమారు 5 మెట్రిక్ టన్నులు
పారిశుద్ధ్య సిబ్బంది	: 120మంది,

ట్రాక్టర్లు 3, కాంపాక్టర్లు 2, ఇవి కాకుండా వీధుల్లో తిరిగి పుష్‌కాట్లు వార్డుకు ఒకటి చొప్పున ఉన్నాయి.

చర్యలు చేపట్టాం

గతంలో వార్డు సచివాలయాలు లేని కారణంగా సిబ్బంది కొరత ఉండేది. ప్రస్తుతం వార్డు సచివాలయ సిబ్బందిని ప్లాస్టిక్ నిషేధం విధించేందుకు వినియోగిస్తున్నాం. వార్డుల్లో ప్లాస్టిక్ వినియోగదారులకు, వ్యాపారులకు, తోపుడు బండ్ల వారికి అవగాహన కల్పిస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నదే ఉద్దేశ్యం. కర్రీపాయింట్లు, టీస్టాల్స్‌లో సైతం పేకింగ్ కోసం వినియోగించే పలుచటి కవర్లు నిషేధించారు. ప్రత్నామ్నాయంగా గుడ్డ సంచులు, బయోడీగ్రేడబుల్ కవర్లు, కాగితం గ్లాసులు వంటివి మాత్రమే వినియోగించాలి.
- రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట

ద్వారపూడి సర్పంచి చెక్ పవర్ రద్దు

ద్వారపూడి, న్యూస్‌టుడే: పంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలకు పాల్పడడంతో మండపేట మండలం ద్వారపూడి సర్పంచి ఈతకోట కిన్నెరకు మూడు నెలలు పాటు చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ద్వారపూడి పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో నిబంధనలు పాటించలేదని, అవినీతి చర్యలకు పాల్పడ్డారని ఈ ఏడాది జులై 15న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశాలివ్వగా రంగంలోకి దిగిన పంచాయతీ అధికారి రాంబాబు(ప్రస్తుతం బదిలీ అయ్యారు) సర్పంచి, ఉప సర్పంచి, కార్యదర్శులను విచారించారు. పంచాయతీ చట్టంను అనుసరించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో నిబంధనలు తుంగలో తొక్కారని, ఇంజినీరింగ్ అధికారుల నుంచి అనుమతులు లేకుండానే నిర్మాణం చేపట్టారని, భవన నిర్మాణ నగదు వసూళ్ల విషయంలో ప్రభుత్వ అధికారుల ప్రమేయం లేకుండా కమిటీయే పూర్తిగా నగదు లావాదేవీలు జరిపారని నిర్ధారణ అయింది. దీంతో సర్పంచి ఈతకోట కిన్నెర చెక్ పవర్‌ను 3 నెలలుపాటు రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై ఎంపీడీఓ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ద్వారపూడి సర్పంచి చెక్ పవర్‌ను రద్దు చేసినందున పంచాయతీ సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసే అధికారం మండల విస్తరణాధికారి డి.శ్రీనివాస్‌కు అప్పగించారని, ఈ ఉత్తర్వులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్‌కు అప్పీలుకు అవకాశం కల్పించారని తెలిపారు.

స్వచ్ఛత ఆయన సంకల్పం


న్యూస్‌టుడే, ద్రాక్షారామ

తనవంతుగా తన ప్రాంతానికి ఏదైనా మేలు చేయాలని తలచారు రామచంద్రపురం పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు చామర్తి శ్రీనివాస గోపాలరావు. తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి మూడేళ్ల కిత్రం చెల్లూరులో ఉద్యోగ విరమణ పొందారు. ఉద్యోగం కాలంలో పిల్లలను విహారయాత్రకు యానాం తీసుకెళ్లారు. అక్కడ జీఎంసీ బాలయోగి వారధిని చూస్తుండగా విదేశీయులు అదే సమయానికి అక్కడకు వచ్చారు. వారు 'భారతీయులు కట్టిన వంతెనలు దృఢంగా ఉన్నాయి... నిర్వహణ అధ్వానంగా ఉంది' అన్న మాటలు ఆయన చెవినపడ్డాయి. దీంతో వంతెనలను బాగు చేయించాలనుకున్నారు. అదే సంకల్పంతో ఉపాధ్యాయుడిగా పాఠశాల స్థాయిలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. 'చేతి సంచులు వాడండి... పాలిథిన్ కవర్లు మానండి' అంటూ పదివేల కరపత్రాలు, పెరట్లో గులాబీలు కాదు... కూరగాయలు పెంచండి అంటూ మరో పది వేలు కరపత్రాలు పంపిణీ చేశారు.



రూ.3.75 లక్షలతో ఆటో కొని....

గోపాలరావు ఉద్యోగ విరమణ చేశాక రూ.3.75 లక్షలతో ఎలక్ట్రిక్ ఆటో కొన్నారు. రోజుకు ముగ్గురు వ్యక్తులకు రూ.800 కూలి ఇస్తూ వారిని సహాయకులను వేసుకొని నిత్యం ఏదో ఒక వంతెన వద్దకు వెళ్లి దానిని శుభ్రం చేస్తారు. ఇప్పటి వరకు రాయవరం మండలం చెల్లూరు, పసలపూడి,వెంటూరు, రామచంద్రపురం మండలం ఉండూరు, ఏరుపల్లి, వెంకటాయపాలెం, ముచ్చుమిల్లి కాజులూరు మండలం గొల్లపేటవు తదితర గ్రామాల్లో వంతెనలను శుభ్రం చేయించారు. రూ.లక్ష నిధిని కేటాయించారు. వంతెనలపై పేరుకుపోయిన ఇసుక, చెత్త, రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, గ్రీజు గుడ్డలు, పొదలు శుభ్రం చేసి వారధులను పరిశుభ్రంగా తయారు చేస్తున్నారు.



స్వచ్ఛవారధి కార్యక్రమ నిర్వహణకు కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ ఆటో

సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారు

స్వతహాగా తెలుగు పండిట్ కావడంతో పర్వదినాల్లో ఆలయాల వద్ద రామాయణం, భగవద్గీత, విష్ణు, లలితా సహస్రపారాయణ చేస్తుంటారు. కాశీ అన్నపూర్ణ ట్రస్టు పేరుతో ఎక్కడైనా ఫంక్షన్లలో మిగులు ఆహారాన్ని సేకరించి తన ఆటోద్వారా పేదలకు పంపిణీ చేస్తుంటారు. రోగులు ఇళ్లకు చేరడానికి ఉచితంగా రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తారు. తన శ్వాస ఉన్నంత వరకు స్వచ్ఛ వారధి, ఇతర సేవా కార్యక్రమాలను తాను కొనసాగిస్తూ సమాజానికి తనవంతు సేవ చేస్తానని గోపాలరావు పేర్కొన్నారు.